# జీవిత మాధుర్యం

రచన :
శ్రీమతి పఠానేని శ్రీశైలభ్రమరాంబ.

"అప్పుడే ఎక్కడికే కమలా బయలుదేరుతున్నావ్?"

"అల్లా వెళ్లాలి" ముక్తసరిగా చెప్పింది కమల.

"అల్లా ఎక్కడకు వెళ్ళాలనే నేనడిగేది? అసలు అల్లా వెళ్ళడానికంటూ కారణం ఒకటుంటుందిగా! అల్లా ఎక్కడికి వెళ్ళబోతున్నావు అని నేనడిగేది."

"అలా అడగడంలో నీ ఉద్దేశమేమిటి అత్తయ్యా? నేను సరదాగా నవ్వుతూ సంతోషంగా వుంటే నువ్వు చూళ్లేవా? అసలు నా విషయంలో నీ ఉద్దేశమేమిటి చెప్పు? పోనీ నీకంత ఇష్టంలేకపోతే షైరుకి, బీచికి, సినిమాకీ వెళ్ళకుండా ఓ భగవద్గీత చేత్తోపట్టుకు నీదగ్గరే కూర్చుంటాలే. అప్పుడైతే నీకు సంతోషంగా వుంటుందేమో."

"కమలా! బైబిలు, భగవద్గీతలోని సారం తెల్సుకుంటే అలా యెన్నటికీ నువ్వు అనివుండేదానివి కావు. ఏ గ్రంథాన్నైతే అజ్ఞానంతో నువ్వీనాడు వెక్కిరిస్తున్నావో, అదే ఒకప్పుడు నీ జీవితగమనాన్నే మార్చివేసి దానిలోనుంచే నీకు విలువ తెలుస్తుంది" అంది పార్వతి.

"ఇప్పుడు నువ్వు ఆ భగవద్గీతనుగురించి లెక్చరిచ్చి నాకు ముక్తిమార్గం చూపించక్కరలేదు, నా మనస్సుని నువ్వు మార్చవల్సిన అవసరమూ లేదు. ఆ విలువలు, అందువల్ల వచ్చే మోక్షం నువ్వే సంపాదించుకో. ఇంకా నీలాంటివాళ్ళు పాతచింతకాయ పచ్చడిలా ఈలాటి పిచ్చినమ్మకాలతో వుండబట్టే స్త్రీలంతా వంటయింటి కుందేళ్లుగా, బానిసత్వపు జీవితాలను గడపవలసి వస్తోంది, నేను అలా బయటికి వెడుతున్నా" అంటూ కమల స్లిప్పరువేసుకు చకచకా నడిచి వెళ్ళిపోయింది. తనమాట నిర్లక్ష్యంచేసి వెళ్ళిపోతూన్న కమలని చూచి ఒక్కసారి నిట్టూర్చింది పార్వతి.

* * *

కమల పార్వతికి సవతి అన్నకూతురు. కమల తల్లి చనిపోతూ ఆరేళ్ళకూతుర్ని పార్వతికి ఆమె తల్లికీ ఒప్పగించి కన్నుమూసింది—అప్పటినుంచీ పార్వతీ ఆవిడతల్లి వీరి చేతుల్లోనే పెరిగింది—కమలకంటె పార్వతి రెండేళ్లు పెద్ద. కమల యిప్పుడు ఇంటర్ సీనియర్ చదువుతోంది.

పార్వతికి విజ్ఞానవిషయాలుపై ఆసక్తి హెచ్చు. అందుకే ఇంటర్‌తో చదువుకి స్వస్తిచెప్పి ఇంటిపనుల్లో తల్లికి సహాయపడ్తూ, తీరికసమయాల్లో తల్లికి సహాయపడ్తూ, తీరికసమయాల్లో భగవద్గీత, బైబిలు, భాగవతం, రామాయణంవంటి సద్గ్రంథాలను చదువుతూ వుంటుంది. ఇంటికి కావల్సిన కూరకాయలు, పువ్వులు మొక్కలు నాటి అన్నిరకాల పనులు నేర్చుకుంది. కమలను స్వంత చెల్లెలుకంటే యెక్కువప్రేమగా చూస్తుంది పార్వతి.

పార్వతి అతి నిరాడంబరంగా వుంటుంది. నేతచీర, చేతినిండా గాజులు, పెద్ద కుంకుమబొట్టు, తలనిండా పువ్వులు పూర్వ సాంప్రదాయంగా నడిచే ఆమెని చూచి ధనవంతురాలనికూడా యెవరూ అనుకోరు. కమల మాత్రం పార్వతికి పూర్తిగా వ్యతిరేకం. వేషంలో మాటల్లో, అన్నింటిలోనూ తేడావుంది. గోళ్ళకి రంగు, పెదిమలకు లిప్‌స్టిక్ హ్యాండ్‌బ్యాగ్ చేత్తోపట్టుకు కళ్ళకి జోడు, కాలికి బూటుతో సినిమాతారల్లా మెరిసిపోతోంది కమల. ఆమెప్రక్కని ఏ ఆడంబరం అక్కర్లేకుండానే సహజస్వభావంతో ప్రకాశిస్తుంది పార్వతి.

కమల కళ్ళల్లో ఏదో ఆకర్షణ.

పార్వతి కళ్ళల్లో ఊహాకందని అగాధాలు.

కమల బేలహృదయం...ఆనంద మొచ్చినా, ఆవేశమొచ్చినాకూడా తట్టుకోలేదు.

పార్వతి నిండుకుండ!...ఆమె అంతర్యాన్ని అర్థం చేసుకోవడానికి మానవులకి సాధ్యంకాదు—

కమల జల్సాగా తిరుగుతూ స్వాతంత్ర్యంగా జీవించాలంటుంది.

పార్వతి భర్తతో ఆనందలోకాల్లో తేలిపోయే జీవిత మాధుర్యాన్ని చవిచూస్తూ, భర్త అడుగుజాడల్లో నడుచుకోవడమే స్త్రీధర్మ మంటుంది.

కమల కష్టాల్నిగురించి వినలేదు; సహించుకోలేదు.

పార్వతి అన్నింటికీ అతీతురాలు.

వాళ్లిద్దరికీ అన్ని అభిప్రాయాల్లోనూ విరుద్ధమే. ఆశయాలు, ఆదర్శాలు ఒకటి కావు. అందుకే వారిద్దరికీ పడదు.

ఆడదానికి సంసారంలో కష్టసుఖాలు పంచుకునే భర్త వున్నప్పుడే జీవితంలోని మాధుర్యం తెలుస్తుంది అంటుంది పార్వతి.

"స్త్రీ స్వాతంత్ర్యాభిలాషతో బయటకూడా తిరగ వచ్చునంటుంది కమల. ఆ విషయం వచ్చినప్పుడు కమల, పార్వతీకూడా వారివారి మనోభావాలనిగురించి ఖచ్చితంగా వాదించుకుంటూరు.

స్త్రీకి యెంత చదువుకున్నా, యెప్పటికైనా పెళ్ళి చేసుకోక తప్పదు. వివాహమైన గృహిణికి తన సంసారం, బాధ్యతా తెల్సుకుని సక్రమంగా నిర్వర్తించడమే శ్రేయస్కరం. ప్రపంచాన్ని ఉద్ధరించడంకంటే, భర్త, పిల్లలు, సంసారమే స్త్రీకి ప్రధానం. ఇంట్లోవుండి సంసారజీవితంలో మాధుర్యాన్ని అనుభవిస్తూ గృహ బాధ్యతల్ని నిర్వహించడమే స్త్రీక గౌరవం. భర్తను కాదని బయటతిరిగే స్త్రీకి గౌరవం, మర్యాద పోతుంది" అంటుంది పార్వతి.

"అయితే ఈ బి.ఎ.లు, యం.ఎ.లు చదివేవాళ్ళకి నీపాటి జ్ఞానంలేకనే అంటావా? ఉద్యోగాలుచేసే ఆడవాళ్ళందరికీ గౌరవమర్యాదలు లేవంటావా?"

"అదికాదు కమలా నేననేది. కేవలం స్త్రీలు చదువుకోవడం ఉద్యోగంకోసమనే అని అనుకోవడం పొరబాటంటాను. స్త్రీలు చదువుకోవడం ముఖ్యంగా విజ్ఞానం కోసమే. అత్యవసరసమయాల్లో ఉద్యోగంచేసి కుటుంబ పోషణ చెయ్యచ్చు. బాగా చదువుకున్న స్త్రీ అయితే తనబాధ్యత తెల్సుకుని సంసారాన్ని సక్రమపద్ధతిలో నడిపించుకుంటూ తనబిడ్డల్నీ, తన చుట్టుపట్లవారినీకూడా మంచిగా మార్చగలదు."

"అయితే స్త్రీలు హెచ్చుగా చదువుకోవడం అనవసరమనేనా నీ ఉద్దేశం? అసలు నీ అభిప్రాయమేమిటో సూటిగా చెప్పేయ్" అంటూ తీవ్రంగా అడిగింది కమల.

"నేను చదువుకోవద్దని చెప్పడంలేదు. నీకెంతవరకూ చదువుకోవాలని వుందో అంతవరకూ చదువుకోవచ్చు. నీకు ఎంతవరకూ ఆసక్తివుంటే అంతవరకూ నేను నిన్ను చదివిస్తా—కేవలము ఉద్యోగాలకి ఆశపడి చదువుకోవడం మంచిది కాదంటాను. ఒంటరిగా స్త్రీ బయటకు అడుగుపెడితే ఆమెకు మర్యాద వుండదంటాను."

"అయితే ఆడది ఉద్యోగం చేసినంతమాత్రంలో వచ్చే నష్టమేమిటో కాస్త చెబుతావా?" అని వ్యంగ్యంగా, హేళనగా అడిగింది కమల—

"కమలా! అసలు చదువంటూవుంటే ఎన్నివిధాలుగానైనా ఉపయోగపర్చుకోవచ్చు. అందులో ముఖ్యంగా భర్తకి ఆర్థికంగా సహాయపడ్డంకోసం ఉద్యోగాన్వేషణకై బయటికి బయలుదేరుతుంది. ఉద్యోగంలో జాయిన్ అయినదగ్గరనుంచి ఆమెకి యెన్నో బాధలు ... అనేక ఇబ్బందులు...అన్నింటికంటే ముఖ్యంగా తను పనిచేసే ఆఫీసులో ఆఫీసరు మంచివాడు కావచ్చు, లేదా కాకపోవచ్చు. తోటగుమాస్తాలు యెటువంటి స్వభావంతో వుంటారో...అసలు కొందరు మగవాళ్ళు, ఆడవాళ్ళు ఎక్కడైనా కనబడితే ఎక్కడపనులక్కడే వదిలేసి ఆమెకేసి గుడ్లప్పగించి చూస్తారు. అందచందాలతో కూడా నిమిత్తంలేకుండా కాస్త వయస్సులోవున్న ఆమె అయితే చాలు; ఇంక పెళ్ళికాని అమ్మాయి అయితే వేరే చెప్పాలా? ... అటు మగవాళ్లుకూడా బ్రహ్మచారులే అయితే వాళ్ళపరిస్థితి యెలా వుంటుందో... వాళ్ళమాట అలావుంచి ఆ అమ్మాయిపరిస్థితి యెంత బాధాకరంగా వుంటుంది?...పరిస్థితులు ప్రాబల్యానికి లొంగిపోయి చలించి తనశీలాన్నే కాపాడుకోలేకపోవచ్చు. అసలు మన స్త్రీలు అంతా అబలలు కమలా! మగవారి మాయమాటలకి బోల్తాపడ్డే అన్నివిధాలా స్త్రీ జీవితానికే ముప్పు. ఎంత చదువుకున్నా, యెంత పెద్ద ఉద్యోగంచేసినా, మగవాళ్ళని యెదిరించే శక్తి స్త్రీలకి లేదు. ఆడదానికి మగవాడి సహాయం యెంతైనా అవసరం, అతడు లేనిదే ఆమె ప్రపంచంలో ఒక్క అడుగు కూడా ముందుకు వెయ్యలేదు."

"అబ్బో! ఈ బి.సి. నాటి కబుర్లు నా దగ్గర కట్టిపెట్టు. మగవాడు లేనంతమాత్రంచేత ఆడది అసలు బ్రతకనేలేదా, అదేదో నేనూ చూస్తాను. అంతేకాదు, స్త్రీ అబల కాదని కార్యరంగంలోకి దూకి కాళిలా గర్జించి సబల అనిపించుకోగలదని సాధించి నిరూపిస్తా" అంది ఆవేశంతో కమల.

"అయితే అది యెలా నిరూపించగలవ్?" నవ్వుతూ అడిగింది పార్వతి.

"నేను బాగా చదువుకొని ఉద్యోగంచేసి పేరు ప్రఖ్యాతులు సంపాదిస్తా. వివాహంమాత్రం జీవితాంతం

చేసుకోను. ఒక మగాడికి బానిసగా వుండిపోవల్సిన ఖర్మ నాకేం పట్టలేదు. ఈ మొగాళ్ళందరినీ నాచుట్టూ కుక్కల్లా తిరిగేటట్లు చేసుకుంటా.''

''కమలా! పెళ్ళి చేసుకోకుండా ఉద్యోగం చేసి ఉదరపోషణ చేసుకున్నంతమాత్రాన స్త్రీజీవితం సఫలం కాదు. అలా గడుపుదామని నువ్వు కంకణం కట్టుకున్నా లోకం అనే భయంకర వ్యాఘ్రం నిన్ను కబళించేందుకే చూస్తుంది కాని, ప్రశాంతిగా జీవింపనియ్యదు.''

''లోకాన్నిగురించి నాకేం భయంలేదు. నన్నుగురించి నువ్వేమీ చెప్పక్కర్లేదు'' అంటూ రివ్వున వీధిలోకి వెళ్ళిపోయింది కమల.

కమల ఇంటర్ సీనియర్ చదువుతూండగానే పార్వతికి పెళ్ళయింది. పార్వతిమెడలో మూడుముళ్లూ వేసేసరికి ప్రసాద్‌కి ఆమెమీద యెక్కడలేని అధికారం వచ్చినట్లు, అంతదాకా ముఖమైనా చూడని అతనిమీద పార్వతికుండే మమత; వారిద్దరూ యెన్నో ఏళ్ళనుంచి పరిచయమున్న వాళ్ళలా కల్సిపోవడం చూస్తూన్న కమలకి చాలా ఆశ్చర్యం వేసింది.

కమల బి. ఎ. లో చేరింది. తన మేనత్త పార్వతితో ఎంతగా వాదించినా ఆమె మాట్లాడకపోతే మాత్రం తనకు తోచేదికాదు. ప్రసాద్ మామయ్య వచ్చినప్పుడు మాత్రం పార్వతి పూర్తిగా మారిపోయేది. ప్రసాద్ రావడంతోనే పార్వతి ముఖం కలువపువ్వులా విప్పారడం, ఇద్దరూ నవ్వుతూ కులుకుతూ కబుర్లు చెప్పుకోవడం, కాఫీ, టిఫిన్, భోజనం అన్నీకూడా ప్రసాద్‌కి స్వయంగా పార్వతే అమరుస్తూండడం గమనించేసరికి కమలకు చాలా ఆశ్చర్యంగా వుండేది, మామయ్య వున్నన్నాళ్ళూ పార్వతీ అతడూ ప్రొద్దస్తమానూ గుసగుసలుతో కబుర్లు చెప్పుకొంటూంటే తన మనస్సుకి ఏదోలావుండేది. మామయ్యవస్తే అత్తయ్య తనతో అసలు మాట్లాడేదికాదు. మామయ్య వున్నన్నాళ్ళూ తనేదో ఒంటరి అయిపోయినట్లుగా బాధపడేది కమల. మామయ్యని చదరంగం ఆడడానికి పేకాటకి పిలిచేది కమల. కాని అత్తయ్యనిక్షణమైనా వదలడం ఇష్టంలేక కాబోలు సరేననడమేకాని గదిలోనుంచి కదలి వచ్చేవాడు కాదు. మామయ్య సాహసించి వాళ్ళిద్దరూ కబుర్లు చెప్పుకొంటూంటే తను వెళ్లి అడిగినా ''మా కమలకి మగవాళ్లని చూచినా, పెళ్ళయిన ఆడవాళ్ళని చూచినా తగని కోపంలెండి. అది పురుషద్వేషియై దేశాన్నుద్ధరిస్తుంది.'' అని అత్త సమాధానమిచ్చేది. ఆ మాటలవేసరికి తనకెంతో కష్టంగా వుండేది. అయినా తన ప్రతిజ్ఞని మాత్రం విడవకూడదనుకునేది.

బి. ఎ. సీనియర్‌లోకి వచ్చింది కమల. పార్వతీ ప్రసాదులు తన కళ్లముందు అన్యోన్యంగా, ఆనందంగా, జంటగా తిరుగుతూంటే, వాళ్ళ సంతోషం చూస్తూంటే తను అట్టి ఆనందానికి తను చాలా దూరమైనట్లు బాధపడేది. తనని ఎందరో పెళ్ళి చేసుకుంటామని అర్థించారు. అయినా తను చలించకుండా ఖచ్చితంగా జవాబిచ్చేది. పార్వతి, ఆమెతల్లి, ప్రసాద్‌కూడా ఎన్నోవిధాల చెప్పారు. పెళ్ళిచేసుకోమని, అయినా తన మొండి పట్టుదల వదలకుండా డిగ్రీ పుచ్చుకుని కాలేజీనుంచి బయటకొచ్చింది.

ఉద్యోగంలో చేరింది కమల. కాలేజీ జీవితంలో అంతమంది యువకులమధ్య చదువుతూన్నప్పుడే కమల ఏ మగవానితోనూ మనిసిచ్చి మాట్లాడలేదు. అదేవిధంగా ఉద్యోగంలోకూడా ఆఫీసులో ఎవరితోనూ మాట్లాడేది కాదు. నిగ్రహశక్తి కోల్పోకుండా ఎంతో పట్టుదలగా ఉద్యోగబాధ్యతని నిర్వహించేది.

ఆఫీసులో హెడ్ గుమాస్తా మూర్తిగారు మాత్రం అప్పుడప్పుడు కమల పనినిగురించి చూడ్డానికి రావడం, రికార్డు వగైరాలు ఇచ్చి పుచ్చుకోవడం తప్పనిసరి అయ్యేది. తనకు తెలియని ఆఫీసు విషయాల్నిగురించి మూర్తితో మాట్లాడవల్సివచ్చేది కమలకి. ఆరునెలలు గడిచేసరికి తనకి తెలీకుండానే మూర్తితో చనువు ఏర్పడిపోయింది. ఇంటి దగ్గరున్నప్పుడు మాత్రం ఏమైనాసరే, ఇంక మూర్తితో మాట్లాడకూడదని మనస్సులో నిశ్చయించుకునేది. కాని ఆఫీసులో అడుగుపెట్టి మూర్తి ముఖం చూసేసరికి ఇంక ఏమీ అనలేకపోయేది. పైగా మూర్తి మాట్లాడకపోతే తనకి తోచేదికాదు. ఒక్కరోజు మూర్తి ఆలస్యంగా వస్తే రికార్డు చేత్తో పట్టుకునేసరికి మూర్తి ముఖం కళ్ళముందు కన్పించేది. చివరకారోజున మూర్తి, కమలగారూ! మిమ్మల్ని వివాహం చేసుకోవాలని నేను మనస్ఫూర్తిగా కోరుతున్నాను. మీకుకూడా అందుకు అభ్యంతరం లేకపోతే నేను చాలా

అదృష్టవంతుణ్ణి, అందుకు మీకు యిష్టమేనా?" అని కూడా అడిగాడు. కాని తనేమీ చెప్పలేకపోవడంతో "మీకు భర్తగా వుండడాన్కి నేను అనర్హుణ్ణా? మీ మనస్సుకి నేను నచ్చకపోయినా, నా హృదయంలో మాత్రం మిమ్మల్ని నా స్వంతంచేసుకుని జీవితమంతా మధురమయం చేసుకోవాలని ఆశిస్తున్నా, మీకు యిష్టముందా? లేదా? ఏదో ఒకటి ఆలోచించి చెప్పండి అని అడిగాడు మూర్తి. ఖండితంతా ఎటూ చెప్పలేక "ఆలోచించుకోడానికి కొంత టైమ్ యివ్వండి" అంది కమల "మీరు నెమ్మదిగా ఆలోచించుకునే చెప్పండి, మీకిష్టమైతేనే అంగీకరించండి" అని కూడా చెప్పాడు హెడ్ గుమాస్తా మూర్తి.

ఒకసారి హెడ్ గుమాస్తా తన యింటికివస్తే పార్వతి ఆమెతల్లి కూడా అతన్ని చూచారు. అతని వంశ సాంప్రదాయం, చదువు, ఉద్యోగం. అన్నీ తెల్సుకుని, తను ఆతనితో సరదాగా మాట్లాడ్డంకూడా గమనించిన అత్తయ్య తల్లి (మా బామ్మ) కమలా! నీ మనస్సుకు నచ్చితే ఆ మూర్తిగారినే పెళ్ళిచేసుకోమ్మా! అంది. కాని కమల ఏమీ సమాధానం చెప్పలేదు. సమాధానం చెప్పకపోయేసరికి ఇంకా పాత పాతాల్లోనే వుందని అత్త ఆమె తల్లికూడా ఊరుకున్నారు.

ఒకనాటి రాత్రి రెండో ఆట సినిమానుంచి ఇంటికి వస్తూంటే కొందరు అల్లరి వెధవలు (రౌడీలు) తనకోసం కాచివుండి అర్ధరాత్రి సమయంలో చుట్టూచేరి గొడవ చేస్తూంటే తను ఏమీ చెయ్యలేకపోయింది. సరిగ్గా వాళ్లు తనని బలాత్కరించబోయే సమయానికి మూర్తిగారుకూడా సినిమానుంచి వస్తూ తనని చూడ్డం, రక్షించడం జరిగింది. నిజంగా ఆ ఆపద సమయంలో మూర్తి రాకపోతే తన బ్రతుకేమయ్యేదో! ఆ రాత్రి మూర్తి జాగ్రత్తగా తీసుకువచ్చి తనని యింటిదగ్గర దిగబెట్టి వెళ్లాడు.

ఆ రాత్రంతా కమల తీవ్రంగా ఆలోచించింది. అత్త పార్వతి చెప్పిన మాటలు అక్షరాలా నిజం! పెళ్లిచేసుకోకుండా ఇల్లా వంటరిగా జీవితాన్ని గడుపుతూ తనెవరిని సంతోషపెట్టాలి? తన ధనంవల్ల సుఖపడే


THE VYSYA BANK LIMITED

A Scheduled Bank :: Estd : 1930

*Registered Office* : VYSYA BANK BUILDING,
**Avenue Road; BANGALORE CITY.**
*Madras Branch* : **268-270, N. S. C. BOSE ROAD.**

SRI. YADALAM S. GOPALAKRISHNA SETTY,
*Chairman.*



SAVINGS BANK ACCOUNTS OPENED
INTEREST ALLOWED AT

$3\frac{1}{4}$ % P: A.

Operations allowed by Cheques on Arrangements.

PARTICULARS CAN BE ASCERTAINED FROM ANY OF OUR OFFICES.

*J. SURYANARAYANA CHETTY,*
*General Manager.*

దెవరు? బయట లోకంలోనూ తనకు గౌరవంలేదు. సంఘంలో తనకి కీర్తిలేదు, మనస్సుకి ఆనందంలేదు, నిర్లిప్తంగా జీవితమంతా ఎడారిలా ఇల్లా గడిపినంత మాత్రంలో తను లోకాన్ని స్త్రీ జాతిని ఏమి ఉద్ధరించ గల్గుతోందా? ఆడది అబల, ఒంటరిగా ఈ ప్రపంచంలో జీవించలేదు అది నిజమే! అనుకొంది.

మూర్తి అందగాడు, అభ్యుదయభావాలు గలవాడు. సుగుణ సంపన్నుడు, యం. ఎ. ప్యాసయ్యాడు. అతనిలో ఏలాంటి లోపమూ లేదని తనకి తెలుసు. మూర్తిని తను ప్రేమిస్తోందో లేదో తనకి తెలియకపోయినా, అతడు కన్పించకపోతే తన హృదయము గిలగిల్లాడుతోంది మూర్తితో మాట్లాడుతున్నా, అతనిప్రక్క నితను నిల్చున్నా ఏదో హాయిగా, మత్తుగా వున్నట్లువుంటుంది. అటువంటి వానిని చేపట్టమని పార్వతి సలహా యిదివరకే యిచ్చింది. ఆ రాత్రంతా తీవ్రంగా ఆలోచించి ఒక నిశ్చయానికి వచ్చింది. తన ఉద్దేశం పార్వతికి చెప్పాలని గబగబా దగ్గరకి వచ్చింది కాని లోపలినుంచి పార్వతీ ప్రసాదులు పకపకా నవ్వుకొంటూండడం తనకి విన్పించే సరికి గిర్రున తిరిగి వెళ్ళిపోయింది. బామ్మతో చెప్పాలనుకుంది. కాని బామ్మకూడా పార్వతి అత్తకొడుకు బుజ్జగాడిని గుండెలపై పడుకోబెట్టుకుని "బుజ్జీ! వదిన గ్రామ సంచారానికి వెళ్ళి ఇంకా ఇల్లు చేరుకోలేదు. బ్రతకడం చేతకాని దద్దమ్మ......" అంటోంది.

అ రాత్రే మూర్తి యింటికి బయల్దేరింది కమల. తనని పెళ్ళాడమంది. అందరిముందూ శాస్త్రయుక్తంగా చేసుకోవాలని మూర్తికి మనస్సాకోరికవున్నా కమల పట్టుదలవల్ల రిజష్టర్ మేరీజీ చేసుకున్నాడు.

ఎప్పుడూ అత్త పార్వతితో వాదించి, మామయ్య ప్రసాద్ మాటకి తిరస్కరించి, చివరకి తను ఓడిపోయి పెళ్ళిచేసుకున్నందుకు తన ముఖాన్ని పార్వతికి చూపించడాన్కి సిగ్గుపడి. ట్రాన్సరై దూరంగా వుండి ఈ మూడు సంవత్సరాలు మూడు రోజుల్లాగ గడిపింది కమల. ఈ యీ మూడేళ్లల్లో కమలకి సంవత్సరవ కూతురు. ఆ పాపకి పార్వతి అని పేరు పెట్టుకుంది. మళ్ళీ యిప్పుడు రెండో బిడ్డ కల్గే సూచనలు కన్పిస్తూన్నాయి. మూర్తికి మళ్ళీ తన ఊరే ఆఫీసరుగా బదిలీచేశారు. తాను వస్తున్నట్లు పార్వతికి ముందుగా జాబు వ్రాసింది.

సంసార జీవిత మాధుర్యం అంతా ఈ మూడేళ్ళలోనూ అనుభవం మీద తెల్సుకుంది ఆనాడు అత్తని ఏ విషయానికైతే తను నిందించిందో, తను ఈ మూడేళ్లూ భర్తకు కాళ్ళు పట్టింది, సేవ చేసింది, భర్తకి తను బానిస అని ఏనాడూ మనస్సులోకూడా భావించలేకపోయింది. కమల. మూడేళ్ళ అనంతరంతన పార్వతి అత్తనీ ప్రసాద్ మామయ్యనీ, బామ్మనీ చూడబోతోంటే ట్రయిన్‌లో కూర్చున్న కమలకి గతం అంతా కళ్ళకి కట్టినట్లు కన్పించి అంతా గుర్తొచ్చి నవ్వుకుంది కమల.

పరధ్యానంగా ఆలోచిస్తూన్న కమలకి ట్రయిను స్టేషన్లో ఆగినట్లుకూడా తెలీలేదు.

"కమలా!" అంటూ పార్వతీప్రసాదులు ఒకేసారి పిలవడం ట్రయినులోనుంచి గభీలున దిగి "అత్తా!" అంటూ పార్వతిని కావిలించి పట్టుకుంది, కమల.

అత్తా కోడళ్ళ అనురాగానికి మూర్తిప్రసాదులు చిరునవ్వు నవ్వారు. చిన్నపార్వతి అవ్వచంకని దూరి వింతగా చూస్తోంది.

